క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేటటౌన్: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. పట్టణ పరిధిలో పురుషోత్తమపట్నం అడ్డరోడ్డు సెంటర్, పురుషోత్తమపట్నంలోని బైపాస్ రోడ్డు సెంటర్, పెదమసీదు సెంటర్‌లలో విద్యుత్ వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని కోరారు.

రేపటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

నాదెండ్ల: మండలంలోని 12 సచివాలయాల పరిధిలో రెండో దశ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5వ తేదీన గొరిజవోలు, 12న సంకురాత్రిపాడు, 19న నాదెండ్ల-1, 2 సచివాలయాలు, 23న ఎండుగుంపాలెం, ఫిబ్రవరి 2న సాతులూరు, 9న చిరుమామిళ్ల, 13న కనపర్రు, 20న ఇర్లపాడు, 27న తూబాడు, మార్చి 5న సాతులూరు -1 సచివాలయం, 15న చందవరం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఏకాగ్రతతో విద్యనభ్యసించాలి

బొల్లాపల్లి: విద్యాభివృద్ధికి దాతలు అందిస్తున్న చేయూతను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ ఆలీసా అన్నారు. మండలంలోని వెల్లటూరు హైస్కూల్లో 10వ తరగతి విద్యార్థులకు విశ్వసాయి జూనియర్ కళాశాల యాజమాన్యం, యూటీఎఫ్ సంయుక్తంగా ఎస్‌ఎస్‌సీ మోడల్ టెస్ట్ పేపర్లను బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ శ్రీనివాసశర్మ, యూటీఎఫ్ నాయకులు వెంకటరెడ్డి, భాస్కర్, చంద్రజిత్‌యాదవ్, రామారావు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై జాగ్రత్తలు చేపట్టాలి

బొల్లాపల్లి: గాలికుంటు వ్యాధి నివారణకు పశువులకు టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి పి.అమీర్‌బాషా తెలిపారు. మండల కేంద్రంలో జాతీయ పశువులవ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా బుధవారం టీకాలు వేశారు. బొల్లాపల్లి, మూగచింతలపాలెం సచివాలయాల పరిధిలో 192 గేదెలకు, 47 లేగదూడలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు సీహెచ్ ఏడుకొండలు పాల్గొన్నారు.

జొన్నలగడ్డలో మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతడి వద్ద నుంచి 46 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్‌ఐ సురేంద్రబాబు బుధవారం తెలిపారు. సాతులూరు గ్రామానికి చెందిన సయ్యద్ బాషా అక్రమంగా మద్యం తరలిస్తూ జొన్నలగడ్డ గ్రామంలో పట్టుబడినట్లు చెప్పారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ వివరించారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సీతారామిరెడ్డి



నరసరావుపేట: మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా యర్రంరెడ్డి సీతారామిరెడ్డి నియమితులయ్యారు. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పట్టణంలో గత 25 ఏళ్లుగా న్యాయవాదిగా ప్రాక్టీసు చేస్తున్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో గుర్తుతెలియని సాధువు మృతదేహాన్ని వినుకొండ పోలీసులు గుర్తించారు. సుమారు 60 ఏళ్లకు పైగా ఉండి తెల్లని వెంట్రుకలు, కషాయం దుస్తులు ధరించి ఉన్నట్లు చెప్పారు. మృతదేహాన్ని వినుకొండ మార్చ్యురీకి తరలించినట్లు చెప్పారు. వివరాలకు వినుకొండ సీఐ 9440796248, 8247852205 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మాచర్ల రూరల్: ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన కంభంపాడు గ్రామం వద్ద బుధవారం చోటు చేసుకుంది. రెంటచింతల గ్రామానికి చెందిన తిక్కా కోటేశ్వరరావు (45) ద్విచక్ర వాహనంపై కంభంపాడు గ్రామం వద్దకు చేరుకోగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో కోటేశ్వరరావు రోడ్డుపై పడగా తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు రూరల్ ఎస్‌ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే

ఘనంగా నివాళి



చిలకలూరిపేటలో సావిత్రీ బాయి పూలే చిత్రపటం నివాళులర్పిస్తున్న రాజేష్‌నాయుడు



యడ్లపాడులో సావిత్రీ బాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ నాగరత్నం



శావల్యాపురంలో మాట్లాడుతున్న ఎంఈఓ సాంబశివరావు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్న ఎంఈఓ జఫ్రుల్లా

చిలకలూరిపేట: విద్య ద్వారానే సమాజంలో ఉన్న అసమానతలను తొలగించవచ్చని మహిళా విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సావిత్రీ బాయి పూలే జయంతిని బుధవారం నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భర్త జ్యోతిరావు పూలే ప్రోత్సాహంతో చదువుకున్న సావిత్రీబాయి దేశంలో మహిళా విద్యకు దారి చూపారని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్ -1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్ -2 విడదల కమలేంద్ర, మండల అధ్యక్షుడు గుత్తా యాములయ్య, కొమరవల్లిపాడు సొసైటీ అధ్యక్షుడు కొండవీటి ఆంజనేయులు, నాయకులు నాయుడు వాసు, గుంజి వీరాంజనేయులు, నకరికంటి శ్రీకాంత్, రాచమంటి చింతారావు, బేరింగ్ మౌలాలి, తాళ్ల అంజిరెడ్డి, కందుల శ్రీకాంత్, పెదవల్లి చినబాబు పాల్గొన్నారు.

శావల్యాపురంలో..

శావల్యాపురం: విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందనే ఉద్దేశంతో బాలికలకు విద్యనందించిన మహోన్నత వ్యక్తి సావిత్రీబాయి పూలే అని మండల విద్యాశాఖాధికారి మద్దికుంట సాంబశివరావు పేర్కొన్నారు. భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని శ్రీరామా పబ్లిక్ స్కూల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలిత సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలల వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎంఈఓ-2 పి.లలితాకుమారి మాట్లాడుతూ నాటి సమాజంలో మూఢనమ్మకాలు, బాల్య వివాహాలు, స్త్రీ విద్య వ్యతిరేకించే పరిస్థితులలో సావిత్రిబాయి పూలే తన భర్త సహకారంతో చదువుకొని స్త్రీ విద్య ప్రాధాన్యాన్ని గుర్తించి పాఠశాలను నెలకొల్పి మొదట ఉపాధ్యాయురాలుగా పేరు తెచ్చుకుందన్నారు. స్త్రీలు అన్నీ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కేవీఆర్ మోహన్‌చంద్, డైరెక్టరు అజిత్‌చంద్, ప్రిన్సిపాల్ కె.రత్నకుమారి పాల్గొన్నారు.

వినుకొండ పట్టణంలో

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో అబ్దుల్‌కలామ్ థెరిసా సేవా సొసైటీ ఆధ్వర్యంలో సావిత్రీబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంఈఓ జఫ్రుల్లా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సావిత్రీబాయి పూలేను ఆదర్శంగా తీసుకొని బాగా చదువుకోవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణి, హెచ్‌ఎం పి.హవిల, జ్యోతి, రాణీజాకబ్, జయశ్రీ, అరవింద్, వెంకటేశ్వర్లు, సుదర్శనీ, సౌజన్య, విశాలాక్షి, అరుణ, నాగరాజు, విజయ్ పాల్గొన్నారు.

తొలితరం ఉపాధ్యాయురాలు ..

నాదెండ్ల: అట్టడుగు వర్గాలకు విద్యాబుద్ధులు నేర్పిన భారతదేశ తొలితరం ఉపాధ్యాయిని సావిత్రీబాయి పూలే అని హెచ్‌ఎం ఐ.కృష్ణానాయక్ చెప్పారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆర్‌వీఎస్ అండ్ సీవీఎస్ హైస్కూల్‌లో..

చిలకలూరిపేటటౌన్: ఆధునిక విద్య ద్వారానే స్త్రీకి విముక్తి అని సావిత్రీబాయి పూలే జీవితమే ఇందుకు నిదర్శనమని ఎంఈఓ కె.లక్ష్మి చెప్పారు. బుధవారం పట్టణంలో ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్‌లో పూలే జయంతిని నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ సావిత్రీబాయి పూలే మొదటి సారిగా బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారని, మహిళల హక్కుల కోసం పోరాడారని కొనియాడారు. ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం ఉప్పలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. మండలంలోని బొప్పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రీబాయిపూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం బొప్పూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

నరసరావుపేట: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం అరండల్‌పేటలోని కార్యాలయంలో దేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను మాట్లాడుతూ విద్యవిప్లవ క్రాంతి సావిత్రిబాయి పూలే వేసిన విద్య పునాదులే నేటి స్త్రీ స్వేచ్ఛకి ప్రధాన కారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు నాగారపు గురు ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, నియోజకవర్గ ఉపాధ్యక్షులు సరికొండ తిమ్మరాజు, జిల్లా బీసీ నాయకులు తిరుమల కొండ నరసింహారావు, విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సిద్ధ అనంత నాగ బ్రహ్మచారి పాల్గొన్నారు.

యడ్లపాడులో..

యడ్లపాడు: మహిళా అక్షరాస్యతకు శ్రీకారం చుట్టిన భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయిపూలే అని యడ్లపాడు ఎంఈఓ ఎంవీ నాగరత్నం చెప్పారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం విజయభారతి ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమం జరిగింది..



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ లక్ష్మి



బొప్పూడి పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం



నరసరావుపేటలో సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

మున్సిపల్ కార్మికులకు సీఎం వైఎస్ జగన్ మేలు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- రెండోరోజు స్వీపర్లతో పాటు పారిశుద్ధ్య పనులు



పట్టణ పరిశుభ్రతకు ఏర్పాటుచేసిన ప్రైవేటు స్వీపర్లతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మున్సిపల్ కార్మికులు గుర్తుపెట్టుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. మున్సిపల్ కార్మికుల సమ్మె నేపథ్యంలో చెత్తతో నిండిన రోడ్లను శుభ్రం చేసేందుకు మున్సిపల్ అధికారుల సహకారంతో ప్రైవేటు స్వీపర్లతో కలసి బుధవారం ఉదయం శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2019 వరకు రూ.11,500 జీతం తీసుకుంటున్న కార్మికులకు ఈ ఐదేళ్లలో రూ.10 వేలు జీతం పెంచారని గుర్తుచేశారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు లేకుండా ఉండాలని తాము చేస్తుంటే డస్ట్‌బిన్‌లు దొర్లించటం లాంటి చర్యల ద్వారా కార్మికులు అడ్డుకోవటం దుర్మార్గం అన్నారు. సమ్మెను విరమింపజేసేందుకు ప్రభుత్వం తరపున కార్మిక యూనియన్లతో మంత్రి ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ, సజ్జల రామకృష్ణారెడ్డి, మున్సిపల్ సెక్రటరీ శ్రీలక్ష్మి చర్చలు చేస్తున్నారని వివరించారు. డిమాండ్లను అంగీకరించి సమ్మెను విరమింపజేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు దుర్మార్గపు ఆలోచనతో కమ్యూనిస్టు పార్టీల వారికి డబ్బులు ఇచ్చి సమ్మె చేయిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు కడుపులో కుళ్లు, కుట్రలు తప్పితే ఏమీ ఉండవన్నారు. కాయలు ఉన్న చెట్టుకే రాళ్లు అన్నట్లుగా చేసే సీఎం జగన్ ప్రభుత్వానికే సమ్మెలు చేస్తున్నారన్నారు. రెగ్యులర్ ఉద్యోగులు రాకపోయినా, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఉద్యోగాలు చేయకపోయినా తాము చూసీచూడనట్లుగా వ్యవహరించామన్నారు. ఇప్పటికైనా ఉద్యోగులు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి తమ సమ్మెను విరమించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, డీఈ ఓలేటి శ్రీనివాసరావు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతాపాల్, సీనియర్ నాయకులు కె.మంగపతిరెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.మీరావలి, బీసీ వెంకట్, హాలీవుడ్ రఘు, ఎం.మార్కు, బి.చంద్రశేఖర్, నాగూర్ మీరా, టి.వీరయ్య పాల్గొన్నారు.

గిరిజన కాలనీ అభివృద్ధికి చర్యలు

డీఎల్‌డీఓ వెంకటరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ వెంకటరెడ్డి

బొల్లాపల్లి: మండలంలో గిరిజనులైన చెంచులు నివసించే ప్రదేశాలను ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యచరణ ద్వారా అభివృద్ధి పరుస్తామని డీఎల్‌డీఓ ఎం.వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. మండలంలోని అయ్యన్నపాలెం, పాపాయిపాలెం, రెడ్డిపాలెం, రేమిడిచర్ల, వెల్లటూరు గ్రామాల్లో సుమారు వెయ్యి కుటుంబాలకు పైగా చెంచులు నివసిస్తున్నట్లు చెప్పారు. తాగునీరు, ఉద్యాన పంటలు, వ్యవసాయం, ఉపాధి హామీ తదితర చెంచులకు అవసరమైన పనులను తక్షణమే అమలుకు కార్యచరణ ప్రణాళికలు చేపట్టాలని ఆదేశించారు. ఏ శాఖకు సంబంధించి ఎటువంటి పనులు చేపట్టాలో ప్రణాళికలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ షేక్ జిలానీబాషా, తహసీల్దార్ ఎస్.దుర్గేశ్వరరావు పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలు



పంటకోత ప్రయోగాలను పర్యవేక్షిస్తున్న అధికారులు

ఈపూరు: మండలంలోని వనికుంట, చిట్టాపురం గ్రామాల్లో బుధవారం పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన అంగజాల సైదులు, గోపు భూలక్ష్మి, పోట్లూరి వీరాంజనేయులుకు చెందిన వరి పొలంలో పంట కోత ప్రయోగాలు నిర్వహించగా ఎకరానికి 28 బస్తాలపైనే దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అనంతరం పల్నాడు జిల్లా ఏడీ ఎస్.శ్రీనివాసరావు, మండల స్టాటిస్టికల్ ఆఫీసర్ కె.నాగశ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయ పంటల దిగుబడి అంచనా కోసం పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతిఒక్కరూ పంట కోత ప్రయోగాలు చేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్సూరెన్స్ పర్యవేక్షణ అధికారి సీహెచ్ శ్రీను, గ్రామ వ్యవసాయ సహాయకులు కె. ఆనంద్‌బాబు, తిరుమల పాల్గొన్నారు.

జగనన్న విద్యాజ్యోతి మెటీరియల్ పంపిణీ



రొంపిచర్ల: మండలంలోని బుచ్చిబాపన్నపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు జగనన్న విద్యాజ్యోతి పరీక్ష మెటీరియల్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న జగనన్న విద్యాజ్యోతి 10వ తరగతి విద్యార్థులకు ఎంతగానో సహకరిస్తుందన్నారు. విద్యాజ్యోతి పరీక్ష మెటీరియల్ విద్యార్థులందరూ అనుసరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి గజ్జల ముసలారెడ్డి, ఓర్సు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు కోటేశ్వరమ్మ, వెంకటరెడ్డి, ఆర్.సెల్వరాజ్ పాల్గొన్నారు.

హోమ్ గార్డుల ఐకమత్యం అభినందనీయం

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



పోలీసు కార్యాలయంలో హోంగార్డుకు చెక్కు అందజేస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పదవీ విరమణ పొందిన హోంగార్డు జేవీఎస్ నాగేశ్వరరావుకు తోటి హోమ్‌గార్డులు అండగా నిలిచారు. హోమ్ గార్డులు అందరూ కలిసి ఒక రోజు వేతనం రూ.5,19,720 ఆర్థికసాయం చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం చెక్కును జిల్లా ఎస్.పి వై.రవిశంకర్ రెడ్డి చేతుల మీదుగా నాగేశ్వరరావు స్వీకరించారు. తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ పదవి విరమణ చేసిన హోమ్‌గార్డుకు సాయం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినందుకు అభినందించారు. కార్యక్రమంలో ఆర్.ఐ వై.రవికిరణ్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో నలుగురికి గాయాలు

చిలకలూరిపేట: సర్క్యూట్‌తో చోటుచేసుకున్న అగ్ని ప్రమాదంలో నలుగురి గాయపడినట ఘటన బుధవారం పట్టణ పరిధిలోని పసుమర్రులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన సంధ్ర రత్నరాజు కుటుంబం వాటర్ కూలర్‌తో రాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తున్నార. ఆ సమయంలో సర్క్యూట్‌తో కూలర్‌లో మంటలు చెలరేగాయి. దీంతో ఇల్లంతా పొగ దట్టంగా వ్యాపించింది. భార్య, ఇద్దరు కూడా ఇంట్లో నుంచి బయటికి వచ్చేందుకు అవస్థలు పడ్డారు. పొగ, మంటలు గమనించిన స్థానికు తలుపు తెలరచి నలుగురిని బయటికి తీసుకురాగలిగారు. అప్పటికే మంటల్లో గాయపడ్డారు. వీరిని ఆస్పత్రికి తరలించారు. ఇంట్లో గృహోపకరణాలు కాలిపోవడం, ఇంటికి జరిగిన నష్టంతో మొత్తం రూ. 5లక్షల వరకు ఆస్తి నష్టం జరిగి ఉంటుందని బాధితులు చెబుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆస్పత్రికి వెళ్లి గాయపడి చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. ఖర్చు మొత్తం తానే భరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, 15,16 వార్డు కౌన్సిలర్లు జాలాది సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు మైలా రాజేష్ ఉన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



వినుకొండ(నూజెండ్ల): ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జూనియర్ కళాశాలలో ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వినుకొండ మున్సిపల్ కమిషనర్ వెంకయ్య వాలీబాల్ పోటీలను బుధవారం ప్రారంభించారు. క్రీడాకారుల పరిచయం అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాల్లో మంచి ఫలితాలు తీసుకురావాలని పిలుపునిచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

చిలకలూరిపేటటౌన్: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం వెలుగు చూసింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని కట్టుబడివారిపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి పుల్లారావు(45) కూలీపనులు చేస్తుంటాడు. ఈ నెల రెండోవ తేదీ మంగళవారం భార్య నరసమ్మను మద్యానికి డబ్బులు అడగగా నిరాకరించటంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగుమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు పుల్లారావును పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు సాయికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


కబడ్డీ, ముగ్గుల పోటీలు




బహుమతులు అందజేస్తున్న కరాటే కోచ్ శిరీషా

నరసరావుపేట ఈస్ట్: బరంపేటలోని శ్రీరామకృష్ణా ఓరియంటల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ నరసరావుపేట ఫీనిక్స్ ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని కబడ్డీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన యంగ్‌స్టర్స్ హెల్పింగ్ సర్వీసెస్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వనమా పవన్‌కుమార్, కరాటే, జూడో కోచ్ ఎస్.శిరీష మాట్లాడుతూ, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ముగ్గులు, కబడ్డీ పోటీలు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. పోటీలలో భాగంలో సీనియర్ విభాగంలో సాయికుమార్ జట్టు, అక్షయకుమార్ జట్టు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించాయి. జూనియర్స్ విభాగంలో ఉదయ్‌కుమార్ జట్టు, సోహెల్ జట్టు బహుమతులు అందుకున్నారు. అలాగే ముగ్గుల పోటీలో ఎం.దుర్గప్రసన్న, షేక్ సమీరా, ఎం.భాగ్యలక్ష్మి బహుమతులు సాధించారు. విజేతలకు కరాటే కోచ్ శిరీషా, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సత్యనారాయణసింగ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు స్వర్ణ రాజేంద్ర, రోటరాక్ట్ సభ్యులు పి.శ్రీనివాసరెడ్డి, గుర్రం పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన



ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



జాలాదిలో ఈవీఎం, వీవీప్యాట్‌ల పనితీరును ఓటర్లకు వివరిస్తున్న దృశ్యం

రొంపిచర్ల: మండలంలోని ఆరేపల్లి, బుచ్చిబాపన్నపాలెం, రామిరెడ్డి పాలెం గ్రామాల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామస్తులతో ఓటింగ్ యంత్రంలో ఓటు వేసే విధానాన్ని ప్రాక్టికల్‌గా చూపించి, వారితో ఓట్లు వేయించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, వీఆర్‌ఓలు లింగయ్య, అబ్బిరెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన

యడ్లపాడు: ఈవీఎం ద్వారా ఓటు వేసే విధానంపై రెండు గ్రామాల్లో రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని జగ్గాపురం, జాలాది గ్రామాల్లో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లోని 104,105,106,107 పోలింగ్ కేంద్రాల వద్ద ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటింగ్ నిర్వహించే విధానం, అవి పనిచేయు తీరుతెన్నులపై ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మోజేస్, జాలాది, జగ్గాపురం కార్యదర్శి, వీఆర్వో కేపీ చారి, బీఎల్‌ఓలు వీరశంకర్, కమలాకర్, బుల్లెమ్మాయి పాల్గొన్నారు.

తేజశ్రీ డెంటల్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

నరసరావుపేట ఈస్ట్: చిన్నతనం నుంచే దంత సంరక్షణపై జాగ్రత్తలు తీసుకోవాలని తేజశ్రీ డెంటల్ హాస్పిటల్ సీఎండీ సిహెచ్.బాలస్వామి తెలిపారు. ప్రకాష్‌నగర్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బుధవారం తేజశ్రీ డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, చాలామంది చిన్నారులు పుచ్చిన దంతాలు, చిగుర్ల వాపు, చిగుర్ల వెంట రక్తం రావటం, దంతాలు లేకపోవటం వంటి సమస్యలతో బాధపడుతున్నారని తెలిపారు. అయితే నొప్పి కలుగుతుందనే భయంతో దంత వైద్యులను సంప్రదించకుండా సమస్యలను పెంచుకుంటున్నారని వివరించారు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో నొప్పిలేకుండా దంత వైద్యాన్ని అందించే పరికరాలు, వైద్య సిబ్బంది ఉన్నారని వివరించారు. దంత సమస్యలు అనేక శారీరక రోగాలకు దారితీస్తాయని గుర్తించాలని తెలిపారు. సురక్షితమైన దంతవైద్యం కోసం ఉపయోగించే లేజర్ పరికరాలు, ఇంప్లాంట్ ట్రీట్‌మెంట్, ఎక్స్‌స్మార్ట్ వంటి ఆధునిక వైద్యవిదానాలు తమ తేజశ్రీ డెంటల్ అన్ని బ్రాంచిలలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శిబిరంలో ఆస్పత్రి చీఫ్ డాక్టర్ ఏ అనీల ఆధ్వర్యంలో వైద్యుల బృందం విద్యార్థులకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శంకరరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

చిలకలూరిపేట: ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. పట్టణంలోని ఏడో వార్డులో విద్యుత్ కార్యాలయం వెనుక గడపగడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో పట్టణంలో ఫేజ్-1 కింద రూ.కోటి 13లక్షల విలువైన పనులు, ఫేజ్ -2 కింద రూ.5.71 కోట్లతో అభివృద్ధి పనులను నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్ పార్వతిదేవి, మున్సిపల్ డీఈఈ టి.వెంకటరమణ పాల్గొన్నారు.